

'వేట కొడవళ్లతో వీరంగం' అసత్య ప్రచారమే : ఎస్పీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రామగిరి మండలం సుద్దుకుంటపల్లి తండాలో వేట కొడవళ్లు పట్టుకొని వీరంగం సృష్టిస్తున్నారంటూ ఓ న్యూస్ చానెల్లో వచ్చిన కథనంలో ఎటువంటి వాస్తవం లేదని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ మాధవ రెడ్డి వివరించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దీనిపై పోలీసు శాఖ వెంటనే విచారణ చేపట్టిందన్నారు. ఈనెల 4 వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఫలితాల అనంతరం తమ పార్టీ అభ్యర్థి గెలుపొందన్న ఆనందంతో రామగిరి మండలం సుద్దగుంటపల్లి తండాలో ఆ పార్టీకి చెందిన కొందరు కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారే తప్ప, ఎవ్వరిని భయభ్రాంతులకు గురి చేయలేదని తమ విచారణలో తేలిందన్నారు. ఈ సందర్భంగా పొట్టేలును కోసుకునే సందర్భంలో మచ్చు కత్తులు పట్టుకున్నారే తప్ప ఎలాంటి వీరంగం సృష్టించే ఉద్దేశం లేదని పోలీసుల విచారణలో తేలిందని ఎస్పీ వెల్లడించారు. దానిని వక్రీకరించి ప్రత్యర్థులను బెదిరించడానికి, గ్రామంలో భయానక వాతావరణం సృష్టించడానికి వేట కొడవలళ్లతో వీరంగం చేశారని ప్రచారం చేశారని వివరించారు. అయితే ఆరోజు జరిగిన సంబరాల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘనల మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్పీ తెలిపారు. కౌంటింగ్ అనంతరం జిల్లావ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసుల అన్ని భద్రత చర్యలు చేపట్టిందని ఎస్పీ వివరించారు.

దంచికొడుతున్న వాన

- ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు
- సీజన్ ప్రారంభంలోనే ఆశాజనకం
- శ్రీసత్యసాయి జిల్లాలో 77.6 మి.మీ వర్షపాతం



రొద్దం మండలంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూడురోజులుగా వర్షం దంచికొడుతోంది. సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగానే నమోదయింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. చెక్‌డ్యాములు, చెరువుల్లోకి నీరు చేరుతోంది. కర్నాటక రాష్ట్రానికి దిగువనున్న ప్రాంతాల్లో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. అనంతపురం జిల్లాలోని డి, హీరేహాల్ మండలంలోని సోమలాపురం వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా పడుతుండటంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ఆశాజనకంగా వర్షాలు పడుతుండటంతో రైతులు రెట్టించిన ఉత్సాహంతో పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షాలు ఆశాజనకంగా ఉన్నాయి. రెండు,మూడు రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక మోస్తరు నుంచి మంచి వర్షపాతం నమోదయింది. అనంతపురం జిల్లా వ్యాప్తంగా సాధారణంగా ఈ వారం రోజుల్లో 20 మిల్లీమీటర్లు కురవాల్సిన చోట 66.1 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. శుక్రవారం సాయంత్రం నుంచి కూడా జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల వర్షపాతం నమోదవుతూనే ఉంది. సీజన్ ప్రారంభంలోనే ఇటువంటి వర్షాలు పడుతుండటంతో రైతుల్లో ఆనందం నెలకొంది. ఇప్పటికే దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు వర్షం ఆగిన తరువాత విత్తనం విత్తుకునేందుకు సిద్ధమవుతున్నారు.

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు

అనంతపురం జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు మండలాలు నమోదయిన వర్షపాతం చూస్తే శెట్టూరులో గరిష్ఠంగా 71.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. బ్రహ్మసముద్రంలో 48 మిల్లీమీటర్లు నమోదయింది. బుక్కరాయసముద్రంలో 45 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదవగా రాయదుర్గంలో 33.75 మిల్లీమీటర్లు వర్షపాతం పడింది. ఇక సత్యసాయి జిల్లాలో మరింత ఎక్కువగా వర్షపాతం నమోదయింది. నల్లచెరువులో 83.5 మిల్లీమీటర్లు పడగా, తనకల్లులో 74.75 మిల్లీమీటర్లు, సోమందేపల్లి 74 మిల్లీమీటర్లు, బత్తలపల్లిలో 68,25 మిల్లీమీటర్లు, తనకల్లులో 64 మిల్లీమీటర్లు, పుట్టపర్తిలో 54 మిల్లీమీటర్లు, తలుపుల్లో 50.25 మిల్లీమీటర్లు, ఆమడగూరులో 42.5 మిల్లీమీటర్లు, నల్లచెరువులో 42 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. మరో రెండు,మూడు రోజులు వర్షాలున్నట్టు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు

వాగులు, చెరువుల్లోకి చేరుతున్న నీరు

వర్షాలు బాగా పడుతుండటంతో వాగులు, చెరువుల్లోకి నీరు చేరుతోంది. కర్నాటకలోనూ అధిక వర్షాలు పడుతుండటంతో కర్నాటక దిగువనున్న ప్రాంతాల్లోకి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. రాయదుర్గం ప్రాంతంలో కర్నాటకలోని నీరు రావడంతో బళ్లారి రోడ్డులో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. డీ.హీరేహళ్ మండలంలోనూ సోములాపురం వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. అప్రమత్తంగా ఉండాలని అధికారులకు జిల్లా కలెక్టరు సూచించారు.

సాగుకు సమయత్తం

సీజన్ ప్రారంభంలోనే మంచి వర్షాలు పడుతుండటంతో రైతులు సాగుకు సమయత్తమవుతున్నారు. ఇప్పటికే వేరుశనగ విత్తన పంపిణీ జరిగింది. అంతరపంటల విత్తనాలను పంపిణీ చేపడుతున్నారు. మంచి వర్షాలొచ్చి పదును కావడంతో విత్తనం విత్తుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తిలో ఎడతెరిపి లేకుండా శుక్రవారం వర్షం కురిసింది. ఉదయం 12 గంటలకు ప్రారంభమైన వర్షం ఏకధాటిగా రాత్రి ఏడు గంటల వరకు కురుస్తూనే ఉంది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. చిన్నచిన్న కుంటలలో, చెక్‌డ్యాముల్లో నీరు చేరుతోంది. రుతుపవనాలు ప్రవేశం తోనే వర్షాలు కురుస్తుండటంతో రైతులలో హర్షం వ్యక్తం అవుతుంది. ఇలా ఉండగా గురువారం రాత్రి కురిసిన వర్షానికి జిల్లాలో 77.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. అత్యధికంగా తనకల్లు మండలంలో 72.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా తాడిమర్రి మండలంలో అత్యల్పంగా 1.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. జిల్లాలో మొత్తం 32 మండలాల్లో ఒక మోస్తారు వర్షం కురిసింది. మృగశిర కార్తెలో వస్తున్న ఈ వర్షాలకు రైతులు ఖరీఫ్ పంటలు పెట్టుకోవడానికి అనువుగా ఉంటుందని పొలాన్ని దుక్కి దున్నుపోవడానికి అవకాశం ఏర్పడిందని రైతులు తెలిపారు.

రొద్దం : రొద్దం మండల వ్యాప్తంగా వర్షం భారీగా కురిసింది. శుక్రవారం కురిసిన వర్షానికి మండలంలోని తురకల పట్నం నుంచి సానిపల్లికి వెళ్లే రహదారిలో వంకలు భారీగా ప్రవహిస్తున్నాయి. దీంతో వర్షపు నీరు మొత్తం తురకలాపట్నం చెరువులో చేరుతోంది. ఈ సీజన్ ప్రారంభంలోనే ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. మండల వ్యాప్తంగా రొద్దం. మరవ పల్లి, కందుకూర్లపల్లి, చిన్నకోడిపల్లి, గౌరాజుపల్లి, చుట్టుపక్కల గ్రామాలలో మూడు నాలుగు రోజుల నుంచి వర్షాలు పడుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బత్తలపల్లిలో కుండపోత వర్షం

బత్తలపల్లి : బత్తలపల్లి మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. మూడు రోజులుగా బత్తలపల్లి మండలంలో కురుస్తున్న వర్షాలకు చిన్న కుంటలు, చెక్ డ్యాముల్లోకి నీరు చేరుతోంది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది. తొలకరి వర్షాలకే వంకలు పారడం, చిన్న కుంటలు నిండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి బత్తలపల్లి మండలంలో 88.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఎఎస్ఒ డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వర్షం కురుస్తోంది. పోట్లమర్రి ఈదుల వంక ప్రవహిస్తోంది. చెక్ డ్యాంలోకి నీరు వచ్చి చేరింది. మండలంలోని పలు గ్రామాల్లోని చెక్ డ్యాంల్లోకి నీరు వచ్చి చేరింది. ఇదిలా ఉండగా వరదాపురం, నల్లబోయనపల్లి, డి. చెర్లోపల్లిలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా చిన్నపాటి వర్షం వస్తే చాలు రోడ్లు నీటికుంటలను తలపిస్తున్నాయి. బత్తలపల్లిలోని ఆర్కి ఫంక్షన్ హాల్‌కు వెళ్లే దారిలోనూ, టీచర్స్ కాలనీకి వెళ్లే దారితో పాటు పలు వీధుల్లో రోడ్డుపై నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు మురుగు నీరు నిల్వతో ఆయా ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది.



బత్తలపల్లిలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు



రాయదుర్గం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు



సంఘీభావంగా అభివాదం చేస్తున్న బిసి సంఘాల నాయకులు

సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పోరాడదాం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అందరం కలిసికట్టుగా పోరాడి సమస్యలను పరిష్కరించుకుందామని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకర్, సీనియర్ నాయకులు బోయ రవిచంద్ర పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీఓ హోం కార్యాలయంలో శుక్రవారం చేనేత ప్రముఖులు గిర్రాజు రవి అధ్యక్షతన బిసిల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారు మాట్లా డుతూ ధర్మవరం అంటే అందరికీ గుర్తుకు వచ్చేది పట్టుచీర అని, ఈ పట్టుచీరకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. పట్టణంలో చేనేత పరిశ్రమపై అన్ని వర్గాల ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అందరినీ కలుపుకొని సమిష్టిగా పోరాడి సమస్యలను పరిష్కరించుకుందామన్నారు. 50 ఏళ్ల క్రితం కాశెట్టి శ్రీనివాసులు, పల్లెం వెంకటేష్ ఎమ్మెల్యేగా ప్రాతి నిధ్యం వహించారని, ప్రస్తుతం మళ్లీ ఓ బిసి వ్యక్తి సత్యకుమార్‌యాదవ్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యార న్నారు. ధర్మవరంలో చేనేతలు ప్రశాంతతను కోరుకుంటారని, పాలకులు అది గమనించి ధర్మవరాన్ని ప్రశాంతంగా ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో బిసి సంఘాల నాయకులు గిర్రాజు రవి, బొట్టు కిష్ట, పల్లపు రవీంద్ర, గోపాల్, పోతలయ్య, సదాశివనంద, శ్రీనివాసులు, జింకల రాజన్న, పల్లపు శివశంకర్, చీమల రామాంజి, పూలకుంట్ల మహేశ్, సాయి, చందమూరు రమేష్, రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

విధిగా మొక్కలు నాటాలి : ఆర్టీసీ డీఎం

కదిరి అర్బన్ : సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని ఆర్టీసీ డీఎం బి.మైనుద్దీన్ సూచించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్ ఉద్యోగుల చేత మొక్కలు నాటించారు. కదిరి డిపోలోని ప్రతి ఉద్యోగి ఒక మొక్క నాటాలని సూచించారు. కదిరి డిపో ఉద్యోగులు ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్, హరిత, రామక్రిష్ణ ఆధ్వర్యంలో మొక్కలు విరివిగా నాటారు. కార్యక్రమంలో డిపో నాయకులు శంకరప్ప, బైరిశెట్టి, సూపర్వైజర్లు ఉత్తన్న, ఉద్యోగులు రామచంద్ర, మౌలాసాహెబ్, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

ధర్మవరం ఆర్టీసీడిపోను తనిఖీ చేసిన ఈడీ

ధర్మవరం టౌన్ : ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు ధర్మవరం ఆర్టీసీ డిపోను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపోలోని గ్యారేజీ, ట్రాఫిక్, కార్గోను పరిశీలించారు. డిపో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా బస్సు కండీషన్ ను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని గ్యారేజీ కార్మికులకు సూచించారు. అనంతరం డిపో ఆవరణంలో మొక్కలు నాటారు. అదేవిధంగా ప్రతిభ కనబరచిన ఆదర్శ ఉద్యోగులకు ప్రశం సాపత్రాలను ఈడీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్, డిపో మేనేజర్ సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని గ్రామాల్లో ప్రజలు ప్రశాంత జీవనం సాగించాలని, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐలు శ్రీనివాసులు, మాల కొండయ్య హెచ్చరించారు. వారు శుక్రవారం మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాల్లో రెండు బృందాలుగా విడిపోయి పర్యటించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి ఘర్షణలకు పాల్పడకుండా అందరూ సంయమనం పాటించాలని సూచించారు. ఒకరినొకరు సహకరించుకుని ప్రశాంత వాతావరణం కల్పించుకుందామన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్తుల విధ్వంసాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదని, రాజకీయ పార్టీల నాయకులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులకు సహకరించాలన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న పోలీసులు

నారాయణ పాఠశాలపై చర్యలు చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ



పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న నారాయణ పాఠశాలపై విద్యాశాఖ అధికారులు వెంటనే శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు ప్రచారాలు, అడ్మిషన్లు నిర్వహిస్తున్న నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టెక్నో, ఈ టెక్నో, ఒలింపియాడ్, ఐఐటి పేర్లతో యూకేజీ నుండి పదవ తరగతి వరకు రూ.30 వేల నుంచి 50వేల వరకు పలు విద్యాసంస్థలు విద్యార్థుల దగ్గర ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. అయితే విద్యార్థులకు క్రీడా మైదానం, మౌలిక సదుపాయాలు కూడా సరిగా కల్పించడం లేదన్నారు. ఫీజులతో పాటు ఇక్కడే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బుక్స్, టైలు కొనాలని నిబంధన పెట్టి రూ. 6 నుంచి 12వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారని విమర్శించారు. విద్యాలయాలను వ్యాపార కేంద్రాలుగా మార్చిన నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇటీవల ఫీజు నియంత్రణ చట్టం తీసుకొచ్చి, దీని కోసం జీవో నెంబరు 53 తీసుకు వచ్చిందన్నారు. దీనిని అనుసరించి ప్రాథమిక విద్యకు రూ.11వేలు, ఉన్నత విద్యకు రూ.15వేలు ఫీజులు తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ నిబందనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. అయితే విద్యాశాఖ అధికారులు అలాంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వ నిబందనలు అతిక్రమిస్తున్న విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోక పోతే ఆలాంటి విద్యా సంస్థలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష దాడులు చేపడుతామని హెచ్చరించారు. దీనికి విద్యాశాఖ అధికారులే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, జస్వంత్, హర్ష కుమార్, హసేన్, సాయి, శ్రీనివాసులు, మణికంఠ, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌లో ఓట్ల తేడాపై అధ్యయనం

ప్రజలకు అందుబాటులో ఉంటాం..
కార్యకర్తలకు అండగా ఉంటాం..
విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న వైసిపి నాయకుల

ప్రజాశక్తి-హిందూపురం

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో తేడాలపై అధ్యయనం చేస్తున్నామని పోలింగ్ అక్రమాలపై కాలమే సమాధానం చెబుతుందని వైసిపి నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైసీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, వేణు రెడ్డి, మధుమతి రెడ్డి, బాలాజీ మనోహర్ మాట్లాడుతు ఎన్నికల్లో పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో వైసిపి ఓటమినిసామాన్యులు సైతం నమ్మడం లేదన్నారు. జగన్ మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించారన్నారు. అదేవిధంగా అభివృద్ధి సైతం చేశారన్నారు. దీనిని దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ హర్షించారన్నారు. అయితే ఈ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు అనేది ఏ విధంగా వచ్చాయో ఒక్కసారి ప్రజలు ఆలోచన చేయాలన్నారు. పట్టణంలోని పోలింగ్ బూత్ నెంబర్ 28లో వైసీపీకి ఒక ఓటు మాత్రమే వచ్చిందని అది ఏ విధంగా సాధ్యమని, కనీసం ఆ బూత్ లో నలుగురు ఏజెంట్లు ఉంటారని ఆ నలుగురి ఓట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. దీనిపై ప్రజలు ఆలోచన చేయాలన్నారు. ఇలాగే వదిలేస్తే పెత్తందారుల చేతిలోకి ప్రజాస్వామ్యం వెళ్లిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది చాలా విలువైనదన్నారు. ఆ ఓటు హక్కు అనేది దుర్వినియోగం చేసే వారి చేతిలోకి వెళ్లిపోతోదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ఉపయోగించిన ఈవీఎం యంత్రాలలో 30 : 70 నిష్పత్తిలో ఓట్లు పడే విధంగా ప్రోగ్రాం చేసుకున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనే కాకుండా హిందూపురం నియోజకవర్గంలో సైతం వైసీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని శాంతికి మారుపేరైన హిందూపురంలో ఈ విధంగా దాడులు చేయడం అమానుషమని అన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కూటమి ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు. తప్పు చేస్తే తప్పకుండా ప్రశ్నిస్తామని అభివృద్ధి చేస్తే తాము స్వాగతిస్తామని అన్నారు. నాయకులు కార్యకర్తలు అధైర్య పడకూడదని ప్రజలతోపాటు ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ రత్నమ్మ, కౌన్సిలర్లు షాజియా, ముస్తక్ అయూబ్, వైసిపి నాయకులు సంతే బిదునురు రాము, మన్సూర్ అహ్మద్, చాంద్‌బాషా, దాదు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్టాండ్‌లో ఆర్ఒ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్ఒ ప్లాంట్ ను డిపో మేనేజర్ శ్రీకాంత్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ శ్రీకాంత్, హిందూపురం రోటరీ క్లబ్ అధ్యక్షులు గిరిధర్ టికారే, కార్యదర్శి ఎంఎ.కల్యాణ్ కుమార్ మాట్లాడుతు ప్రయాణికుల సౌకర్యార్థం రూ.1.8లక్షలు వెచ్చించి ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ జి.తిమ్మారెడ్డి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎ.శ్రీధర్ గౌడ్, ఫ్రీజర్ స్పాన్సర్ నంబూరి సుమంత్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఒ ప్లాంట్ ను ప్రారంభిస్తున్న ప్రముఖులు



ఢిల్లీలో చంద్రబాబుతో ఎపి ఎంపీలు

చంద్రబాబును కలిసిన ఎంపీలు

సోమందేపల్లి : టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుని శుక్రవారం హిందూపురం, అనంతపురం పార్లమెంట్ సభ్యులు బికె.పార్థసారథి, అంబికా లక్ష్మినారాయణ ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి అభినందలు తెలిపారు. వారితో పాటు ఎపికి చెందిని పలువురు పార్లమెంట్ సభ్యులు, మాజీ ఎంపీలు ఉన్నారు.

రేపు యుటిఎఫ్ జిల్లా సమావేశం

కొత్తచెరువురూరల్ : కొత్త చెరువు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 9వ తేదీ యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మధ్యంతర జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు జయ చంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవా ధ్యక్షులు భూతన్న తెలిపారు. కొత్తచెరువులో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే సమావేశానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న యుటిఎఫ్ మండల అధ్యక్షులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వ విద్య బలోపేతం, ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమానికి సంబంధిం చిన అంశాలపై చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమం లో యుటిఎఫ్ నాయకులు బాబు, గీతాలక్ష్మి, శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మారుతి, జిల్లా కార్యదర్శులు లక్ష్మీనారాయణ, శివశంకర్, హరికృష్ణ పాల్గొన్నారు.

11న మండల మీట్

కొత్తచెరువు రూరల్ : కొత్త చెరువు ఎంపిడిఒ కార్యాలయంలో ఈ నెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు మండల సర్వసభ సమావేశం నిర్వహిస్తునట్లు ఎంపిడిఒ సిద్ధారెడ్డి శుక్రవారం తెలిపారు. సమావేశానికి ఎంపిపి గాయత్రి అధ్యక్షత వహిస్తారని తెలిపారు. సమావేశంలో మండలంలో నెలకొన్నా వివిధ సమస్యలపై చర్చిస్తారన్నారు. కావున సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరవ్వాలని ఆయన కోరారు.



చంద్రబాబుతో పల్లె కుటుంబం

చంద్రబాబును కలిసిన 'పల్లె' కుటుంబం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఏపీకి కాబోయే ముఖ్యమంత్రి టిడిపి అధినేత చంద్రబాబును శుక్రవారం తాడేపల్లిలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే సింధూరరెడ్డితో పాటు భర్త వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఆమె తండ్రి మాజీ డిజిపి శంకర్‌రెడ్డి, ఆమె తల్లి రాణి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబుకు పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. పుట్టపర్తి ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించిన సింధూరరెడ్డికి చంద్రబాబు అభినందనలు తెలిపారు.

రోడ్డుకు అడ్డంగా కూలిన వేపచెట్టు

రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలో గురువారం రాత్రి వీచిన ఈదురుగాలుల ధాటికి స్థానిక కొత్తపేటలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో వేపచెట్టు కూలి రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో స్థానికులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేపచెట్టు కిందకు పడే సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు. స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ సిబ్బంది వచ్చి రోడ్డుకు అడ్డంగా పడిఉన్న వేపచెట్టును పక్కకు తొలగించారు.



రోడ్డుకు అడ్డంగా కూలిన వేపచెట్టు

క్షయ నివారణ, అడల్ట్ బిసిజిపై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని కప్పలబండ గ్రామంలో శుక్రవారం పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మలేరియా నిర్మూలన, అడల్ట్ బిసిజిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, ప్రతి ఫ్రై డేని డ్రై డే పాటించి జ్వరాల బారిన పడకుండా ఉండాలని అవగాహన కల్పించారు. దోమ పుట్ట కూడదు, కుట్ట కూడదు, చిన్నదోమ పెను ప్రమాదమని, దోమతెరలు వాడాలని నీటి నిల్వలు దోమలకు ఆవాసాలు, వేపాకు పొగ-దోమలుకు సెగ అని నినాదాల రూపంలో తెలిపారు. మలేరియా, డెంగీ జ్వరాలను దూరంపెట్టండని కోరారు. అలాగే అడల్ట్ బిసిజి వ్యాక్సిన్‌పై వివరించారు. ఈ వ్యాక్సిన్ వల్ల క్షయ వ్యాధి రాదని, గడచిన ఐదేళ్లలో టిబి వచ్చి తగ్గిపోయిన వారు, 60 ఏళ్లు నిండిన వారు, పొగతాగేవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, శరీర ద్రవ్యరాశి సూచిక లేక ఎత్తుకు తగిన బరువు తక్కువ వుండే వారు, టీబీ రోగులతో సన్నిహిత సంబంధాలు ఉన్నావారు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వేయించుకుని ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని సూచించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, ఎస్‌యుఓ రమణయ్య, సూపర్‌వైజర్ వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పి అపర్ణ, ఆరోగ్య కార్యకర్త ప్రమీల పాల్గొన్నారు.



కప్పలబండలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మడకశిర అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల

ప్రజాశక్తి-మడకశిర

మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. వారు శుక్రవారం విజయవాడలో నేషనల్ హైవే ఉన్నతాధికారితో మాట్లాడి మడకశిర పట్టణంలోని వడ్రపాలెం నుంచి అంబేద్కర్ సర్కిల్ మీదుగా మధుగిరి రోడ్డు, వెటర్నరీ కాలేజ్ వరకూ రోడ్డు నిర్మాణం కోసం రూ. 15 కోట్లు మంజూరు చేయించా రు. ప్రభుత్వం ఏర్పడక ముందే అధికారులతో చర్చిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చేస్తున్న కృషి పట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఉన్నతాధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు, గుండుమల

నారా లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌ని శుక్రవారం మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఉండవల్లిలోని లోకేష్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

తహశీల్దార్‌కు జనసేన పార్టీ నాయకుల వినతి

ప్రజాశక్తి-గోరంట్ల

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను అడ్డుకుని, కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు తహశీల్దార్ అక్బల్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయం వెనుక సర్వే నెంబర్ 272లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను ఆపాలని గతంలో అధికారులకు ఫిర్యాదు చేయగా ఆ స్థలంలో నోటీసు బోర్డు ఏర్పాటు చేసినా ఆ స్థలం అన్యాక్రాంతం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను ఆపి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ నకిలీ పట్టాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు నిర్మాణాలను ఆపి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు శ్రీరాములు, శ్రీనివాసులు, తిరుపాల్, లక్ష్మీనారాయణ, అనిల్, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న జనసేన పార్టీ నాయకులు

సవితమ్మకు మంత్రి పదవి ఇవ్వాలి

ప్రజాశక్తి- సోమందేపల్లి

పెనుకొండ ఎమ్మెల్యే సవితమ్మకు మం త్రి పదవి కేటాయించాలని నియోజకవర్గ కురుబ సంఘం నాయకులు కోరారు. వారు శుక్రవారం పెనుకొండ పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు రాయలసీమలో రెండు ఎంపీ సీట్లు, ఒక ఎమ్మెల్యే సీటు కేటాయించి కురుబలకు న్యాయం చేశారని, అందుకు తగ్గట్టుగా రాష్ట్రంలోని 175 నియోజక వర్గాల్లో 6 లక్షల మంది కురుబలు టిడిపితోనే ఉన్నారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసులు, రామకృష్ణ, రామాంజనేయులు, ప్రసాద్ పాల్గొన్నారు. సవితమ్మకు మంత్రి పదవి కేటాయించాలని సోమందేపల్లి మండల టిడిపి నాయకులు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ సిద్ధలింగప్ప, నీరుగంటి చంద్రశేఖర్, మాజీ జడ్పిటిసి వెంకటరమణ, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు డివి ఆంజనేయులు, సర్పంచి నరసింహులు, టౌన్ కన్వీనర్ సూరి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసిపి మంత్రులు శంకరనారాయణ, ఉషశ్రీచరణ్ సవితమ్మపై అనేక అక్రమ కేసులు బనాయించి అణిచి వేయాలని చూసినా ఆమె వారిని ధైర్యంగా ఎదుర్కొని, గ్రామాల్లో టిడిపి శ్రేణులకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, రైతు సంఘ నాయకులు హరికృష్ణ, బాబయ్య, లక్ష్మన్న, ఆనంద్, రమణ, రామంజి, శివశంకర్, ప్రసాద్, నాగేంద్ర, మురళి, లక్ష్మీనారాయణ, నరసింహులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కురుబ సంఘం నాయకులు

పరిగి : పెనుకొండ నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలు పొందడమే కాకుండా సత్యసాయి జిల్లాలో అత్యధిక మెజారిటీతో గెలుపొందిన సవితమ్మకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని మండల టిడిపి కురుబ సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులు కోరారు. సవితమ్మ ఎమ్మెల్యేగా గెలవడంతో శుక్రవారం స్థానిక బీరలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెనుకొండ నియోజకవర్గంలో టిడిపికి ఊపిరి పోయడంతో పాటు అహర్నిశలు ప్రజా సంక్షేమానికి పాటుపడిన సవితమ్మకే మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి బాలాజీ, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

16న అయ్యప్ప ఆలయంలో అక్షరాభ్యాసం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండల పరిధిలోని ఎం.కొత్తపల్లిలో బంగారుబండపై వెలసిన శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో ఈ నెల 16వ తేదీ అక్షరాభ్యాసం పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పరిపాలన అధికారి పూల రెడ్డప్ప సమక్షంలో అక్షరాభ్యాసం కరపత్రాలు విడుదల చేశారు. కదిరి జోగి శ్రీదేవి ఫౌండేషన్ ఛైర్మన్ కోడూరు శ్రీకాంత్ ఆధ్వర్యంలో పురోహితులు పంచరత్న సురేష్‌శర్మ చేత అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు పిల్లల తల్లిదండ్రులు 98855 78756, 99083 42433 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ధర్మప్రచార, ఆధ్యాత్మిక గ్రామ వికాస్ ప్రముఖ్ చంద్రశేఖర్, రమణ నాయక్, మల్లెల రమేష్, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవులు కేటాయించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రాష్ట్రంలో గెలుపొందిన బిజెపి ఎంపీలు, ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు కేటాయించాలని పుట్టపర్తి బిజెపి నాయకులు కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అత్యధిక సీట్లతో మూడోసారి అధికారం చేపట్టడంతో పాటు దేశ ప్రధానమంత్రిగా ముచ్చటగా మూడవసారి నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర క్యాబినెట్‌లో రాజమండ్రి ఎంపీ పురంధేశ్వరికి, రాష్ట్ర క్యాబినెట్‌లో ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్‌కి చోటు కల్పించాలని కోరారు. అంతకుముందు స్థానిక చౌడేశ్వరీదేవి ఆలయంలో రాష్ట్ర కల్లుగీత కార్మికుల కన్వీనర్ హరికృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొండమరాజు, జిల్లా మీడియా కన్వీనర్ జ్యోతి ప్రసాద్, బుక్కపట్నం, పుట్టపర్తి రూరల్, పట్టణ అధ్యక్షుడు చెన్నప్ప, భాస్కర్‌రెడ్డి, రామాంజనేయులు, భాగ్యమ్మ, రఫీ, రాఘవేంద్ర, మురళి, సుభాను, యోగేంద్ర, శివ, చంద్రమోహన్‌రెడ్డి, రామాంజనేయులు, మూర్తి, సతీష్, లక్ష్మిపతి, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యకు

శాశ్వత పరిష్కారం చూపుతాం

ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని గాంధీనగర్ రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్‌యాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా బ్రిడ్జి కింద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఢిల్లీ పర్యటనలో ఉన్న తన దృష్టికి వచ్చిందన్నారు. దీంతో వెంటనే ఢిల్లీలో సంబంధిత శాఖ అధికారులు, రైల్వేశాఖ అధికారులతో మాట్లాడానని, త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ప్రస్తుతానికి బ్రిడ్జి కింద నీటిని తొలగించి శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమారును ఆదేశించామన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో బ్రిడ్జి కింద వర్షం నీరు నిల్వ ఉండకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు.

సత్యకుమార్‌యాదవ్ గెలుపుపై సంబరాలు

ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేగా సత్యకుమార్‌యాదవ్ విజయం సాధించడంతో కూటమి శ్రేణులు పట్టణంలోని శారదానగర్‌లో అక్కదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఎదుట 101 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఫాతిమా, వలి, కొత్తకోట వెంకటరాయుడు, ఆదెప్ప, చంద్రశేఖరెడ్డి, రవినాయక్, భాస్కర్‌రెడ్డి, రవీంద్ర, రమేష్‌నాయక్, సోమునాయక్, ఈశ్వరనాయక్, అబ్దుల్లా, లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తన వేరుశెనగ పంపిణీ చేయండి

వ్యవసాయ అధికారులకు ఎమ్మెల్యే పల్లె సింధూర సూచన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఈ ఏడాది తొలకరి వర్షాలు సకాలంలో కురిశాయని, విత్తన సాగుకు ఇది మంచి సమయమని, అర్హులైన రైతులందరికీ సకాలంలో నాణ్యమైన విత్తన వేరుశెనగ పంపిణీ చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి వ్యవసాయ అధికారులకు సూచించారు. ఆమె శుక్రవారం విజయవాడ నుంచి వ్యవసాయ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడిన పలు విషయాలను తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 19,045 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు కేటాయించినట్లు తెలిపారు. ఓడి చెరువు మండలంలోని తంగేడు కుంట పంచాయతీలోనీ శోత్రీయం భూముల రైతులకు అదనంగా 690 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు కేటాయించినట్లు వెల్లడించారు. విత్తన కాయలు లేవని రైతులెవరూ అధైర్య పడవద్దని ప్రతి ఒక్కరికీ అందించే బాధ్యత టిడిపి ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ప్రతి రైతు సకాలంలో పంటలు సాగు చేసుకొనేలా సిద్ధం కావాలని ఎమ్మెల్యే సూచించారు.



ఎమ్మెల్యే పల్లె సింధూర



ఎమ్మెల్యే కందికుంటను సన్మానిస్తున్న కదిరి పట్టణ ప్రముఖులు

ఎమ్మెల్యే కందికుంటకు శుభాకాంక్షల వెల్లువ

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కదిరి నూతన ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఆధ్వర్యంలో శుక్రవారం యూనియన్ సభ్యులు ఎమ్మెల్యే కందికుంటను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు మాట్లాడుతూ కందికుంట గెలుపుపై హర్షం వ్యక్తం చేశారు. కందికుంట ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ పుట్టపర్తి రీజినల్ కార్యదర్శి జీవిపి రావు, సివిపిఆర్ఎస్ రెడ్డి, జిసిఎస్ నాయుడు, డిపో కార్యదర్శి పి.శంకరప్ప, డిపో కోశాధికారి కె.హరికుమార్, హెచ్.సుధీందర్, సింహ, సలాంబాషా, ఎం.రవి, ఎస్‌కె.వలి, హృదయరాజు, గ్యారేసీ నాయకులు , పాల్గొన్నారు. కదిరి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కందికుంట వెంకటప్రసాద్‌ను శుక్రవారం పలువురు ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని హరీష్ స్కూల్స్ అడ్వైజర్, మానస ధార సేవా సంస్థ వ్యవస్థాపకులు ఎంఎస్.ప్రశాంత్, కరస్పాండెంట్ ఎంఎస్ కిరణ్ ఎమ్మెల్యే నివాసంలో కందికుంటను కలిసి పూలమాలలు వేసి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-గోరంట్ల

అంగన్‌వాడీ సెంటర్లలో పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని సూపర్వైజర్ రజిత ఆదేశించారు. ఆమె శుక్రవారం మండలంలోని గంగాదేవిపల్లి గ్రామంలో ఉన్న అంగన్వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలకు సక్రమంగా పంపిణీ చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని అంగన్వాడీ కార్యకర్తను హెచ్చరిం చారు. కాగా అంగన్వాడీ కార్యకర్త సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని, లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా ఇవ్వడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై సూపర్వైజర్ రజిత మాట్లాడుతూ కార్యకర్త, ఆయా ఇద్దరికీ మెమో జారీ చేస్తామని తెలిపారు.



అంగన్వాడీ సెంటర్‌ను తనిఖీ చేసిన సూపర్వైజర్ రజిత

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలమత్తూరు : మండల పరిధిలోని కనుమ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొర్లకుంట గ్రామానికి చెందిన షఫీ(45) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. షఫీ లేపాక్షిలో మైక్ సెట్, సైకిల్ మరమ్మతులు చేసి జీవనం సాగిస్తు ఉండేవాడు. గురువారం ఉదయం సొంత గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై లేపాక్షి వెళ్తుండగా కనుమ వద్ద జరిగిన ప్రమాదంలో స్పృహ కోల్పోయాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన 108 వాహనంలో హిందూపురం ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వెద్యులు నిర్ధారించారు. అయితే ప్రమాదం ఎలా జరిగింది అనేది తెలియరాలేదు. గుర్తుతెలియని వాహనం ఢీకొందని కొందరు, జింకను ఢీకొన్న ఆనవాళ్లు ఉన్నాయని కొందరు తెలపగా పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



ప్రమాదంలో మృతిచెందిన షఫీ

రోడ్డు ప్రమాదంలో డీఎస్పీకి స్వల్పగాయాలు

సోమందేపల్లి : పెనుకొండ జాతీయ రహదారిలో పులేకమ్మ గుడి వద్ద శుక్రవారం పెనుకొండ డీఎస్పీ బాబ్‌జాన్ సైదా ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. వివరాలు.. సోమందేపల్లి మండలంలో ఓ కేసుకు సంబంధించి విచారణకు వచ్చిన డీఎస్పీ తిరిగి వెళ్తుండగా పెనుకొండ జాతీయ రహదారిపై పులేకమ్మ గుడి సమీపంలో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డీఎస్పీకి, పోలీస్ సిబ్బందికి గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం డీఎస్పీ డిశ్చార్జ్ అయ్యారు.



ప్రమాదంలో గాయపడిన డీఎస్పీ బాబ్‌జాన్

10న పర్స సత్యనారాయణ శత జయంతి : సిఐటియు

సోమందేపల్లి : ఈ నెల 10వ తేదీ ఉదయం 11 గంటలకు సాయి ఆరామం గణేష్ సర్కిల్ వద్ద పర్స సత్య నారాయణ శత జయంతి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ తెలిపారు. పెనుకొండ పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సత్యనారాయణ శత జయంతి ఉత్సవ కార్యక్రమానికి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు హాజరవుతారని, సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు మండల అధ్యక్షులు బావమ్మ, కార్యదర్శి బాబావలి, తిప్పన్న, సివిల్ సప్లైస్ హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఫకృద్దీన్ పాల్గొన్నారు.

సింధూరరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని మండలంలోని టిడిపి నాయకులు కోరారు. స్థానిక మాజీ జడ్పిటిసి ఇంటి ఆవరణలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఉన్నత విద్యావంతురాలైన పల్లె సింధూరరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పిట్టా ఓబుల్‌రెడ్డి, మండల కన్వీనర్ జయచంద్ర, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, ఆరిఫ్‌ఖాన్, షాను, మాబాషా, రాజారెడ్డి, జోలి బాబా, షబ్బీర్, సౌదీ నాగరాజు, చాంద్‌బాషా, నిజాం, గంటా శ్రీనివాసులు, అబ్బులు, తోఫిక్ పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో సంబరాలు

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరులో శుక్రవారం టిడిపి నాయకులు, కార్యకర్తల విజయోత్సవ సంబరాలు చేసుకు న్నారు. గురువారం సాయంత్రంతో ఎన్నికల కోడ్ ముగియడంతో స్థానిక టిడిపి నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. నాయ కులు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన పోయి రామరాజ్యం వచ్చిందన్నారు. ఇకపై ప్రజలు సంతోషంగా గుండెలపై చేయి వేసుకొని నిద్రించవచ్చన్నారు. అరాచక పాలనకు స్వస్తి పలికి టిడిపికి ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నందమూరి బాలక్రిష్ణ గెలుపు, 30 వేల మెజారిటీ కార్యకర్తల కృషి, ప్రజలకు ఉన్న నమ్మకం వల్లే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగారెడ్డి, నాగరాజుయాదవ్, లక్ష్మినారాయణయాదవ్, శ్రీదేవి పాల్గొన్నారు.

సబ్సిడీపై కంది విత్తనాలు

చిలమత్తూరు : ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న కంది విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని ఏఓ వంశీకృష్ణ తెలిపారు. కంది విత్తనాలు ఎల్ఆర్జీ-52 రకం విత్తనాలు 4 కిలోలు పూర్తి ధర రూ. 559.2 కాగా రూ. 167.7 సబ్సిడీ పోగా రూ. 391.5 పైసలకు పంపిణీ చేస్తారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-గాండ్లపెంట

ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. మండలంలోని మల్లమీదపల్లి పంచాయతీ లోని కోటూరుకు చెందిన ప్రభాకర్ శుక్రవారం తన భూమి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని జెసిబితో చదును చేస్తుండగా గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆ భూమి వద్దకు వెళ్లి ప్రభుత్వ భూమిలో జెసిబితో చేస్తున్న పనులు ఆపించారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా పనులు చేపడితే రెవెన్యూ శాఖ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

శ్మశానవాటికను ముస్లిములకు అప్పగిస్తాం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

కబ్జాకు గురైన శ్మశానవాటికను ముస్లిములకు అప్పగిస్తామని ఎంపిపి ఆదినారాయణ యాదవ్ హామీ ఇచ్చారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల అధికారులు గ్రామాల్లోని సమస్యలపై చర్చించారు. ఎంపిపి మాట్లాడుతూ ముస్లింల శ్మశాన వాటిక కబ్జా విషయాన్ని ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి ముస్లింలకు అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెంకట్‌రెడ్డి, తహశీల్దార్ సరస్వతి, ఎంపిడిఒ జిఎన్ఎస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు చిన్న బాలముని, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

గ్రంథాలయాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారిణి అంజలిసౌభాగ్యవతి సూచించారు. ధర్మవరం శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు ముగిశాయి. శుక్రవారం నిర్వహించిన ముగింపు సమావేశానికి ఎల్ఐసి ఏజెంట్లు నాగరాజు, మురళి, ముకుంద హాజరై మాట్లాడారు. పిల్లలు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. అనంతరం వేసవి శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, శివమ్మ, రమణ, గంగాధర్, పాఠకులు పాల్గొన్నారు.

రొద్దం : స్థానిక శాఖా గ్రంథాలయంలో 21 రోజుల పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ముగిసింది. దీంతో శుక్రవారం గ్రంథాలయ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో ముగింపు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ టీచర్ లక్ష్మీనారాయ ణరెడ్డి ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కొత్తచెరువు రూరల్ : గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి కె.జయరాం, మాజీ సర్పంచి హరినాథ్ చౌదరి సూచించారు. కొత్తచెరువు శాఖ గ్రంథాలయంలో వేసవి సెలవుల్లో నిర్వహించి శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంపీడీవో మహమ్మద్, పాఠకులు కిష్టప్ప, శంకరప్ప, రామాచారి, శ్రీరాము లు, నరసింహులు, అటెండర్ మునీర్, పాల్గొన్నారు.

చిలమత్తూరు : స్థానిక గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం(సమ్మర్ క్యాంప్) శుక్రవారం ముగిసింది. ముగింపు సమావేశంలో గ్రంథాలయ అధికారి మల్లికార్జున మాట్లాడుతూ శిక్షణలో పాల్గొన్న పిల్లలకు వ్యాసరచన, చిత్రలేఖనం, తదితర పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అతావుల్లా, ఉపాధి జేఈ శ్రీనివాసులు, డ్రాయింగ్ మాస్టర్ వేణుగోపాల్, పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అంజలి సౌభాగ్యవతి

బత్తలపల్లి : విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే మేధాశక్తి పెరుగుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. బత్తలపల్లి శాఖ గ్రంథాలయంలో అధికారిణి రాజేశ్వరి అధ్యక్షతన వేసవి విజ్ఞాన శిబిరం(సమ్మర్ క్యాంప్) ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శ్రీజ్యోతి హైస్కూల్ ప్రిన్సిపల్ మిడతల లక్ష్మీనారాయణ, డైరెక్టర్ మిడతల తేజ, టీచర్ శంకరయ్య, రమేష్‌యాదవ్, నాగరాజు తదితరులు హాజరయ్యారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.